ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి


అధికారులతో మాట్లాడుతున్న కార్పొరేటర్ దేవేందర్‌రెడ్డి

మల్లాపూర్: డివిజన్ పరిధిలో నెలకొన్న సమస్యలను దశలవారీగా పరిష్కరిస్తానని మల్లాపూర్ కార్పొరేటర్ పన్నాల దేవేందర్‌రెడ్డి అన్నారు. గురువారం నెహూనగర్ కాలనీలో జీహెచ్‌ఎంసీ, ఇంజినీరింగ్, జలమండలి అధికారులతో కలిసి పర్యటించారు. ఇంటింటికి తిరిగి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. డ్రైనేజీ, రోడ్లు, తాగునీరు, విద్యుత్ దీపాలు తదితర సమస్యలను స్థానికులు కార్పొరేటర్ దృష్టికి తీసుకురాగా.. సానుకూలంగా స్పందించిన ఆయన పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. డీఈ రూప. ఏఈ స్రవంతి, జలమండలి అధికారి వేణుగోపాల్‌రావు, వర్క్ ఇన్‌స్పెక్టర్లు తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ సమస్యలు పరిష్కరించాలని వినతి


వినతిపత్రం అందచేస్తున్న కార్పొరేటర్ శ్రావణ్‌కుమార్

గౌతంనగర్: వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకుని విద్యుత్ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ.. మల్కాజిగిరి డివిజన్ కార్పొరేటర్ గురువారం మల్కాజిగిరి టీఎస్‌సీపీడీఎల్ ఏడీఈ యాదగిరి కలిసి వినతిపత్రం అందజేశారు. రాజీవ్‌గాంధీనగర్, ఇందిరానెహ్రూనగర్, ఓల్డ్ మల్కాజిగిరి, విష్ణుపురి, ఓల్డ్ నేరేడ్‌మెట్‌లో నూతన విద్యుత్ స్తంభాలు, ట్రాన్స్‌ఫార్మర్స్, హ్యాంగర్స్, ప్రమాదకరంగా ఉన్న చెట్ల కొమ్మలను తొలగించాలని కోరారు. సమయపాలన లేకుండా విద్యుత్ కోతల వల్ల ప్రజలు ఇబ్బంది పడుతున్నారన్నారు. బీజేపీ నేతలు వెంకటేష్‌యాదవ్, అమర్, సీతారాం కృష్ణ, వెంకటకృష్ణ తదితరులున్నారు.

రోడ్డు మరమ్మతు పనుల పరిశీలన


మరమ్మతు పనులను పరిశీలిస్తున్న కార్పొరేటర్

బోడుప్పల్: 5వ డివిజన్ పరిధిలోని భీంరెడ్డినగర్, ఐబీసీటీ కాలనీల్లో జరుగుతున్న రోడ్డు మరమ్మతు పనులను గురువారం స్థానిక కార్పొరేటర్ సింగిరెడ్డి పద్మారెడ్డి పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకుని మరమ్మతు పనులను త్వరితగతిన పూర్తి చేసి ప్రజలకు ఇబ్బందులు లేకుండా చూడాలని అధికారులను కోరారు. రోడ్డు గుంతలమయంగా ఉండటంతో రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు కలుగుతున్నాయన్నారు. ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా తగిన చర్యలు తీసుకుంటామన్నారు. కాంగ్రెస్ పార్టీ నాయకులు సత్యనారాయణ, కరుణాకర్, రాములు నాయకులు పాల్గొన్నారు.

విద్యార్థులకు నోట్‌బుక్స్ పంపిణీ


నోట్‌బుక్స్ పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి

మల్లాపూర్: నాచారం అన్నపూర్ణ కాలనీలోని వెస్లీ (ప్రభుత్వ ఎయిడెడ్) పాఠశాల్లో విద్యార్థులకు నోట్‌బుక్స్, యూనిఫామ్‌లను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి హాజరై మాట్లాడారు. విద్యార్థులకు సరిపడా ఉపాధ్యాయులు లేకపోవడంతో ఓ ప్రైవేట్ టీచర్‌ను బోధించడానికి సమకూరుస్తామన్నారు. తాగునీరు సరఫరా సరిగ్గా లేదని ఉపాధ్యాయులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకొచ్చారు. వెంటనే జలమండలి మేనేజర్‌తో మాట్లాడి త్రాగునీటి సమస్య లేకుండా చూడాలని ఆదేశించారు. విద్యార్థులు బాగా చదువుకుని మంచి మార్కులు సాధించాలని ఆకాంక్షించారు. గ్రేటర్ బీఆర్‌ఎస్‌నేత సాయిజెనేఖర్, మల్లేష్‌యాదవ్, ముత్యంరెడ్డి, రాంచందర్, కరణ, వేముల మారయ్య పాల్గొన్నారు.

విద్యార్థులు చదువుపై శ్రద్ధ వహించాలి

మల్కాజిగిరి: విద్యార్థులు చదువుపై శ్రద్ధ వహించాలని నేరెడ్‌మెట్ పోలీస్‌స్టేషన్ ఎస్సై పుల్లారెడ్డి సూచించారు. గురువారం నేరెడ్‌మెట్‌లోని జిల్లా పరిషత్ హైస్కూల్‌లో యాంటీ డ్రగ్‌పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఎస్సై మాట్లాడుతూ.. విద్యార్థులు చిన్నతనంలో వ్యసనాలకు అలవాటు పడి జీవితాలను పాడుచేసుకోవద్దన్నారు. ముఖ్యంగా డ్రగ్స్, మత్తు పదార్థాలకు అలవాటుపడి కేసులు నమోదైతే భవిష్యత్తులో ఉద్యోగ అవకాశాలు కూడా పొందడానికి వీలుండదన్నారు. తల్లితండ్రులు కష్టపడి చదివిస్తున్నారని వారి కష్టాన్ని గుర్తుంచుకోవాలన్నారు.

కార్పొరేటర్ పర్యటన


స్థానికులతో మాట్లాడుతున్న కార్పొరేటర్ శాంతి

అల్వాల్: అల్వాల్ డివిజన్ రామచంద్రాపురం కాలనీలో కార్పొరేటర్ శాంతిశ్రీనివాస్‌రెడ్డి గురువారం అధికారులతో కలిసి పర్యటించారు. ఈ సందర్భంగా కాలనీలో కుక్కలబెడద, మురుగు, విద్యుత్ స్తంభాల మార్పు, తాగునీరు తదితర సమస్యలను స్థానికులను అడిగి తెలుసుకున్నారు. సమస్యలను పరిశీలించి త్వరితగతిన పరిష్కరించాలని అధికారులకు సూచించారు. ఏఈ లక్ష్మి, రామారావు, జలమండలి అధికారి శేఖర్, నాయకులు మల్లేష్‌గౌడ్, అరుణ్, యాదగిరి తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన వార్షిక బ్రహ్మోత్సవాలు

అల్వాల్: అల్వాల్‌హిల్స్ శ్రీపద్మావతి గోదా సమేత ప్రసన్న వేంకటేశ్వరస్వామి ఆలయ వార్షిక బ్రహ్మోత్సవాలు గురువారం వైభవంగా ముగిశాయి. చక్రస్నానం, పుష్పయాగం, పలు ప్రత్యేక పూజలు నేత్రపర్వంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ చైర్మన్ మురళీధర్‌రెడ్డి, శ్రీనివాస్‌రావు, శ్రీనివాస్‌రెడ్డి, భూపాల్ రెడ్డి, నర్సింగ్‌రావు, వెంకటేశ్వర్‌రావు, ఆలయ కమిటీ సభ్యులు, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

ఎక్కడ చూసినా చెత్త తిప్పలే..

ఇష్టారాజ్యంగా ఇంటింటి చెత్త సేకరణ

- వ్యాపార సముదాయాల సేకరణకే ప్రాధాన్యం
- వారంలో ఒకటి రెండుసార్లు చెత్త సేకరిస్తే గొప్ప..
- ఇళ్లలో కంపు కొడుతున్న చెత్త బుట్టలు
- ఈగలు, దోమల స్వైరవిహారంతో రోగాలు
- ఇప్పటికైనా స్పందించాలంటున్న ప్రజలు


చెత్తకుప్పలపై జీహెచ్‌ఎంసీ సిబ్బందిని ప్రశ్నిస్తున్న కాలనీ సంక్షేమసంఘం ప్రతినిధులు



సౌత్ కమలానగర్‌లో ఆటోరిక్షా కార్మికులు రోడ్లపై వదిలిన చెత్తకుప్పలు

కుషాయిగూడ: కాప్రా సర్కిల్ పరిధిలో ఇంటింటి చెత్త సేకరణ ఇష్టారాజ్యంగా మారింది. స్వచ్ఛ ఆటో కార్మికుల నిర్లక్ష్యం కారణంగా జీహెచ్‌ఎంసీ ప్రతిష్టాత్మకంగా చేపట్టిన స్వచ్ఛ ఆటోల నిర్వహణ లక్ష్యం నీరుగారిపోతోంది. అధికారుల పర్యవేక్షణ లోపమే దీనికి ప్రధాన కారణంగా తెలుస్తోంది. దీనికి ప్రత్యక్ష ఉదాహరణ ఏఎస్‌రావునగర్ డివిజన్, సౌత్ కమలానగర్ కాలనీ. దాదాపుగా చెత్త ఆటో రిక్షా కార్మికుల పనితీరు అంతటా ఇదే తరహాలో ఉందంటే ఆశ్చర్యపోవాల్సిన అవసరం లేదు. నిత్యం ఇళ్ల నుంచి తడి పొడి చెత్తను సేకరించాల్సిన ఆటో రిక్షా కార్మికులు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారు. ప్రతినెలా ముక్కుపిండి డబ్బులు తీసుకోవడంలో చూపిస్తున్న శ్రద్ధ చెత్త సేకరణలో చూపించడం లేదంటున్నారు. పైగా ఇళ్ల నుంచి చెత్త సేకరణ కంటే వ్యాపార సముదాయాలు, హోటళ్లు, బార్‌లు, ఫంక్షన్‌హాళ్లు, హాస్టళ్ల నుంచి చెత్త సేకరణకే అధిక ప్రాధాన్యం ఇస్తున్నారు. ఇళ్లలో వారంలో ఒకటి, రెండుసార్లు చెత్త సేకరిస్తే అదే గొప్ప అనుకోవడం తప్ప చేసేదేమీ లేదని పలువురు అంటున్నారు. ఇదేమిటని ప్రశ్నిస్తే దురుసుగా మాట్లాడటం, ఇబ్బందులకు గురిచేస్తున్నారని అంటున్నారు. రోజుల తరబడి చెత్త, బుట్టల్లో ఉండటంతో ఇళ్లు కంపు కొడుతున్నాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పైగా ఈగలు, దోమలు స్వైరవిహారంతో రోగాల బారిన పడుతున్నామంటూ ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ క్రమంలో గత్యంతరం లేని పరిస్థితుల్లో ఇళ్లలో పేరుకుపోయిన చెత్తను చీకటి సమయంలో రోడ్ల పక్క ఖాళీ ప్రదేశాల్లో పడేస్తున్నారు. దీంతో కాలనీలో ఎక్కడ చూసినా దుర్వాసన, చెత్త కుప్పలే కనిపిస్తున్నాయి. వ్యాపార సముదాయాల నుంచి సేకరించిన చెత్తను కార్మికులు ఆటోల్లో తరలించకుండా రోడ్లపై ఎక్కడ పడితే అక్కడ కుప్పలు కుప్పలుగా పడేస్తూ ఇబ్బందులు కలిగిస్తున్నారనే ఆరోపణలు కూడా వినిపిస్తున్నాయి. స్వచ్ఛ ఆటోరిక్షా కార్మికుల పనితీరుపై సంబంధిత అధికారులు దృష్టి సారించి చెత్త సేకరణ సజావుగా జరిగేలా చూడాలని కోరుతున్నారు.

పలుమార్లు మందలించినా మారని తీరు

సౌత్ కమలానగర్‌లో చెత్త సేకరించే ఆటో రిక్షా కార్మికులపై స్థానికంగా వస్తున్న ఫిర్యాదుల మేరకు ఇప్పటికే పలుమార్లు మందలించినా వారి పనితీరు మారడం లేదు. చెత్త సేకరణలో జాప్యంతో పాటు రోడ్లపై ఎక్కడ పడితే అక్కడ చెత్త కుప్పలు వేస్తూ ఇబ్బందులకు గురిచేస్తూనే ఉన్నారు. నిత్యం చెత్త సేకరణ చేయకపోవడంతో వీధుల్లో చెత్త కుప్పలుగా పేరుకుపోతోంది. వీరి తీరుపై పైఅధికారులకు కూడా ఫిర్యాదు చేశాం. - అంజలి, అసిస్టెంట్ ఎస్‌ఎఫ్‌ఏ

మల్లన్న ఆలయ వార్షిక బ్రహ్మోత్సవాలు


స్వామివారి కల్యాణంలో ..


దేవాలయ వార్షికోత్సవంలో...

గౌతంనగర్: గౌతంనగర్ డివిజన్ మల్లికార్జుననగర్‌లోని మల్లన్న ఆలయ 27వ వార్షిక బ్రహ్మోత్సవాలు గురువారం వైభవంగా జరిగాయి. ఉదయం 6 గంటలకు ధ్వజారోహణ, 7 గంటలకు రుద్రాభిషేకం, 8 గంటలకు మండపారాధన, కలశస్థాపన, గణపతి, రుద్ర హోమం అనంతరం సీతారామచంద్రుల కల్యాణోత్సవం నిర్వహించారు. కార్పొరేటర్లు మేకల సునీతారాముయాదవ్, శ్రవణ్‌కుమార్ ఆలయ కమిటీ సభ్యులు, మహిళ భక్తులు పాల్గొన్నారు.

అష్టలక్ష్మి దేవాలయ వార్షికోత్సవం..

మౌలాలి: మౌలాలి డివిజన్ పరిధిలోని ఆర్.కే హౌసింగ్ కాలనీల్లోని శ్రీ అష్టలక్ష్మి దేవాలయం 14వ చతుర్దశ వార్షికోత్సవంలో భాగంగా గురువారం ఉత్సవ దేవతామూర్తులకు అభిషేకాలు, అనంతరం అష్టలక్ష్మి సమేతా ఆదినారాయణ కల్యాణోత్సవం వైభవంగా జరిగింది. అనంతరం అన్నదానం ప్రసాద కార్యక్రమాన్ని చేపట్టారు. సాయంత్రం ఉత్సవమూర్తులను శోభాయాత్ర చేపట్టారు. మౌలాలి కార్పొరేటర్ సునీతాయాదవ్, అష్టలక్ష్మి దేవాలయం ఆలయ కమిటీ సభ్యులు రాజిరెడ్డి, అలివేలు, సంధ్యారాణి, గుణవంతి, సుజాత, ప్రధాన అర్చకులు శ్యామ్‌సుందరాచార్యులు తదితరులు పాల్గొన్నారు.

రేపు ఉచిత యోగా శిబిరం

రామంతాపూర్: అంతర్జాతీయ యోగా దశాబ్ది ఉత్సవాల సందర్భంగా యోగా టీచర్ కో- ఆర్డినేషన్ కమిటీ ప్రధాన కార్యదర్శి ప్రముఖ యోగా థెరపిస్ట్ డాక్టర్ దొడ్ల సత్యారెడ్డి, పతంజలి యోగా సమితి కో-ఆర్డినేటర్ రామనాథం ఆధ్వర్యంలో శనివారం రామంతాపూర్ ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల గ్రౌండ్‌లో ఉదయం 5.30 నుంచి రాత్రి 8 గంటల వరకు ఉచిత యోగా శిబిరం నిర్వహిస్తున్నారు. ఈ శిబిరంలో వివిధ వ్యాధుల నివారణకు సంబంధించిన పలు యోగాసనాలు, ఆహార నియమాలు, గృహ వైద్య చిట్కాలు వివరిస్తారని నిర్వాహకులు ప్రకటించారు. యోగా శిక్షణ శిబిరానికి డాక్టర్లు, సైంటిస్టులు, మేధావులు సామాజిక సేవకులు, ప్రజాప్రతినిధులు, రాజకీయ నాయకులు పాల్గొంటున్నారన్నారు. వివరాలకు 9246173775.

ఆలయ షెడ్డు నిర్మాణానికి విరాళం



రామంతాపూర్: గణేష్‌నగర్‌లోని శ్రీ రేణుకాఎల్లమ్మ ఆలయం ముందు షెడ్డు నిర్మాణం కోసం రాష్ట్ర జయశంకర్ సేవా సమితి చైర్మన్ కొత్తపల్లి సతీష్‌కుమార్ గురువారం రూ.లక్ష వితరణ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అమ్మవార్లను ఆరాధిస్తే దుష్టశక్తులు దూరమై అన్ని శుభాలే జరుగుతాయన్నారు. సేవా సమితి సభ్యులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనుల పరిశీలన


రామంతాపూర్ : ఇందిరానగర్‌లోని మెట్లగల్లీ కార్పొరేటర్ బండారు శ్రీవాణి డ్రైనేజీ పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా గురువారం ఆమె మాట్లాడుతూ.. రూ.20 లక్షల వ్యయంతో డయా పైపులైన్ పనులను చేపడుతున్నామన్నారు. జల మండలి మేనేజర్ పల్లె రవీందర్‌గౌడ్ బీజేపీ నేతలు, కార్యకర్తలు పాల్గొన్నారు.



నీట్ పరీక్ష తిరిగి నిర్వహించాలి

మల్కాజిగిరి: నీట్ పరీక్షను కేంద్రం తిరిగి నిర్వహించాలని మల్కాజిగిరి సీపీఎం పార్టీ డిమాండ్ చేసింది. గురువారం మల్కాజిగిరిలో ఆ పార్టీ నేతలు కృపాసాగర్, నారాయణ రెడ్డిలు మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వం విద్యార్థుల పట్ల బాధ్యతారాహిత్యంగా వ్యవహరిస్తున్నారని మండిపడ్డారు. అధికారులు, కొంతమంది రాజకీయ నాయకులు కలిసి పేపర్‌లీక్ చేసి లక్షలాది మంది విద్యార్థులను ఆందోళనకు గురిచేశారని ఆరోపించారు. సుప్రీంకోర్టు జోక్యం చేసుకుంటనే తప్పా.. ప్రభుత్వం స్పందించడం లేదని, లీక్‌కు పాల్పడిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. నాయకులు విజయ్‌కుమార్, సూర్యకుమార్, ప్రదీప్‌దాస్ గుప్తా పాల్గొన్నారు.

సదరం క్యాంప్ పరిశీలన



మల్కాజిగిరి: మల్కాజిగిరిలోని జిల్లా కేంద్ర ఆసుపత్రిలో గురువారం జరిగిన సదరం క్యాంప్‌ను మల్కాజిగిరి డివిజన్ కార్పొరేటర్ శ్రవణ్ పరిశీలించారు. ఈ సందర్భంగా క్యాంప్‌కు వచ్చిన వారికి అందుతున్న ఏర్పాట్లను సూపరింటెండెంట్ డాక్టర్ సునీత, ఆర్‌ఎంఓ సంగీత్‌ను అడిగి తెలుసుకున్నారు. జిల్లా మొత్తానికి మల్కాజిగిరి ఆసుపత్రిలోనే క్యాంప్ ఉండటంతో ఇబ్బందులు లేకుండా చూడాలని కోరామన్నారు. సదరం స్లాట్ బుకింగ్‌లో ఇబ్బందులు ఎదురవుతున్నాయని క్యాంప్‌కు వచ్చిన కొందరు తెలియజేశారని సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్తామన్నారు.

ప్రజా సమస్యల పరిష్కారంపై హర్షం


కార్పొరేటర్‌తో కాలనీవాసులు

మల్లాపూర్: నాచారం డివిజన్ పరిధిలోని కార్తికేయనగర్ కాలనీ రోడ్‌నెంబర్ 09,10లలో సీసీ రోడ్డు పనులకు కార్పొరేటర్ శాంతి సాయిజెనేఖర్ రూ.40 లక్షలు మంజూరు చేయించినందుకు గురువారం కార్తికేయనగర్ కాలనీ వాసులు కార్పొరేటర్‌కు కృతజ్ఞతలు తెలిపారు. అధ్వానంగా ఉన్న రోడ్డుకు అధికారులతో మాట్లాడి సీసీరోడ్డు పనులకు నిధులు మంజూరు చేయించి టెండర్ ప్రక్రియ పూర్తిచేయించినందుకు కాలనీవాసులు హర్షం వ్యక్తం చేశారు. అనంతరం కార్పొరేటర్ మాట్లాడుతూ.. సీసీరోడ్డు పనులను వారంలోగా ప్రారంభిస్తామని కాలనీవాసులకు హామీ ఇచ్చారు. అప్సర్, మోహీనుద్దీన్, మల్లారెడ్డి, దేవేందర్, కిషోర్, కులకర్ణి, బాలకిషన్, సతీష్, శ్రీనివాస్‌రావు తదితరులున్నారు.

టీయూడబ్ల్యూజే-ఐజేయూ రాష్ట్ర కోశాధికారిగా వెంకట్‌రెడ్డి

కుషాయిగూడ: టీయూడబ్ల్యూజే-ఐజేయూ రాష్ట్ర కోశాధికారిగా కాప్రాకు చెందిన సీనియర్ జర్నలిస్టు మోతే వెంకట్‌రెడ్డి నియమితులయ్యారు. ఖమ్మంలో జరిగిన టీయూడబ్ల్యూజే రాష్ట్ర మహాసభల్లో ఆయన నియమకాన్ని ప్రకటించారు. గతంలో రంగారెడ్డి, మేడ్చల్ జిల్లా అధ్యక్షుడిగా, రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడుగా పనిచేసిన ఆయన సేవలను గుర్తిస్తూ రాష్ట్ర కోశాధికారిగా అవకాశం కల్పించారు. తనపై విశ్వాసంతో కోశాధికారిగా నియమించిన టీయూడబ్ల్యూజే యూనియన్ పెద్దలకు కృతజ్ఞతలు తెలిపారు. జర్నలిస్టుల సమస్యల పరిష్కారానికి తనవంతుగా కృషి చేస్తానన్నారు. ప్రధాన కార్యదర్శి బాలరాజు వెంకట్‌రెడ్డి నియామకంపై హర్షం వ్యక్తం చేశారు.

నేడు పోస్టల్ స్కీమ్స్‌పై మేళా

మల్కాజిగిరి: మల్కాజిగిరి పోస్టాఫీస్ ఆధ్వర్యంలో శుక్రవారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు పోస్టల్ స్కీమ్స్‌పై మేళా నిర్వహిస్తున్నామని పోస్ట్ మాస్టర్ శ్యామల ప్రకటించారు. సుకన్య సమృద్ధి యోజన, పోస్టల్ బ్యాంక్ అకౌంట్, పోస్టల్ లైఫ్ ఇన్సూరెన్స్, ప్రమాదభీమా తదితర స్కీమ్‌లు ఉన్నాయని ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

నేడు నీట్ పరీక్ష పై..

మల్కాజిగిరి: నీట్ పరీక్షపై కేంద్ర ప్రభుత్వ తీరును నిరసిస్తూ.. మల్కాజిగిరి చౌరస్తాలో కాంగ్రెస్‌పార్టీ ఆధ్వర్యంలో ధర్నా జరుగుతుందని మీడియా కన్వీనర్ గుండా నిరంజన్ ప్రకటించారు. మల్కాజిగిరి మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి ధర్నాలో పాల్గొంటారని కాంగ్రెస్ శ్రేణులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

బోడుప్పల్‌లో తైబజారు వేలం వాయిదా

బోడుప్పల్: బోడుప్పల్ నగర పాలక సంస్థలో గురువారం జరగాల్సిన తైబజారు వేలాన్ని వాయిదా వేస్తున్నట్లు కమిషనర్ రాంలింగం వెల్లడించారు. బోడుప్పల్‌లో ఆయన మాట్లాడుతూ.. జూలై 16న 2024 సంవత్సరం నుంచి 31వ తేదీ మార్చి 2025 వరకు తైబజారు రుసుంను వసూలు చేసుకునేందుకు పేపర్‌లో ప్రకటన ఇచ్చినట్లు తెలిపారు. ఈనెల 20న ఉదయం 11 గంటలకు నగర పాలక సంస్థ కార్యాలయంలో బహిరంగ వేలం నిర్వహించాల్సి ఉందని, 19వ తేదీన సాయంత్రం 3 గంటల లోపు తైబజారు వేలంలో పాల్గొనే అభ్యర్థులు కమిషనర్ పేరు మీద రూ.10 వేలు డీడీ తీసి పూర్తి వివరాలతో అప్లికేషన్స్ ద్వారా సమర్పించాల్సి ఉంది. ఇద్దరు మాత్రమే తైబజారు వేలంలో పాల్గొనగా.. వారు కూడా తైబజారు వేలం నియమాలను పాటించకుండా దరఖాస్తు చేసుకున్నారన్నారు. దీంతో గురువారం జరగాల్సిన వేలాన్ని వాయిదా వేసి త్వరలో తైబజారు వేలాన్ని నిర్వహిస్తామని కమిషనర్ రాంలింగం ప్రకటించారు.

ఆదర్శప్రాయుడు బీఎల్‌ఆర్

మంత్రి పొన్నం ప్రభాకర్


ఆర్థికసాయం అందజేస్తున్న మంత్రి పొన్నం ప్రభాకర్, ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి

కుషాయిగూడ: తన నియోజకవర్గంలో మెడిసిన్ సీటు సాధించి ఫీజులు కట్టలేని పేద విద్యార్థులకు ఐదు సంవత్సరాల పాటుగా ఫీజు చెల్లించి ప్రోత్సహిస్తున్న ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి ఆదర్శప్రాయుడని మంత్రి పొన్నం ప్రభాకర్ కొనియాడారు. ఉస్మానియా యూనివర్సిటీలో మెడిసిన్ సీటు సాధించిన చర్లపల్లి డివిజన్, చక్రిపురం కాలనీకి చెందిన పేద విద్యార్థి పెరపు ప్రశాంత్ చదువు కోసం బీఎల్‌ఆర్ సమకూర్చిన ఆర్థిక సాయాన్ని గురువారం మంత్రి పొన్నం ప్రభాకర్ చేతులమీదుగా అందజేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ సేవాభావంతో పేద విద్యార్థులకు ఉన్నత విద్య అందించాలనే బీఎల్‌ఆర్ సంకల్పం గొప్పదన్నారు. అనంతరం బీఎల్‌ఆర్ మాట్లాడుతూ ఉప్పల్ నియోజకవర్గంలో ఉన్నత చదువులు చదువుకోవాలన్న ప్రతి పేద విద్యార్థికి అండగా ఉంటానన్నారు. పదవులు, రాజకీయాలతో తనకు సంబంధం లేదని కేవలం తనవంతుగా సేవ చేయాలనే ఆశయంతో ముందుకు సాగుతున్నానన్నారు. కార్యక్రమంలో ప్రశాంత్ తల్లిదండ్రులు నర్సింహ, దేవమని, నేతలు నేమూరి మహేష్‌గౌడ్, రాజేశ్వర్‌రెడ్డి, శ్రీకాంత్‌రెడ్డి, సురేష్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

భవిష్యత్తులో అంతా డిజిటల్ బోధనే !

మల్లాపూర్: భవిష్యత్తులో డిజిటల్ పద్ధతిలోనే బోధన జరుగుతుందని, ప్రసుత్తం విద్యారంగంలో కొత్త అభ్యాస పద్ధతులకు అనుగుణంగా మారాల్సిన ప్రాముఖ్యత ఉందని ఢిల్లీ పబ్లిక్ స్కూల్ చైర్మన్ మల్కా కొమరయ్య, సీనియర్ ప్రిన్సిపాల్ సునీతారావు అన్నారు. ఈనెల 15న దేశవ్యాప్తంగా కార్డే బ్లాంచే సీబీఎస్సీ ప్రాజెక్ట్ డిజిటల్ ట్రాన్స్‌ఫర్మేషన్ అండ్ హైబ్రిడ్ లెర్నింగ్ ప్రాజెక్టును ప్రారంభించింది. దీనిలో భాగంగా పైలట్ ప్రాజెక్ట్‌లో మొత్తం దేశవ్యాప్తంగా 48 పాఠశాలు ఎంపికయ్యాయి. రాష్ట్రంలోని పాఠశాలల్లో పైలట్ ప్రాజెక్ట్‌గా నాచారం ఢిల్లీ పబ్లిక్ స్కూల్ ఎంపిక కాగా.. గురువారం డీపీఎస్ పాఠశాల్లో సైబర్ లెర్నింగ్ సెంటర్‌ను ప్రారంభించారు. డీజీఎం సరిత, వైస్ ప్రిన్సిపాల్ గౌరీవెంకటేష్, సుధ, ప్రాజెక్ట్ కో-ఆర్డినేటర్ సుభాష్ తదితరులు పాల్గొన్నారు.

పదవీవిరమణ అభినందన సభ



అల్వాల్: అల్వాల్ మండల పరిధిలోని కొకూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గురువారం ఉపాధ్యాయురాలు అంజమ్మ పదవీవిరమణ అభినందన సభ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి పలువురు ఉపాధ్యాయ సంఘాల నేతలు, ఉపాధ్యాయులు, బంధువులు హాజరై అంజమ్మను సత్కరించి పదవి విరమణ శుభాకాంక్షలు తెలియజేశారు. అనంతరం ఆమె చేసిన సేవలను కొనియాడారు. పీఆర్‌టీయూ మేడ్చల్ జిల్లా అధ్యక్షులు రామేశ్వర్‌గౌడ్, ప్రధాన కార్యదర్శి ఆనంద్‌రెడ్డి, అల్వాల్ మండల శాఖ అధ్యక్షులు నర్సింహ, ప్రధాన కార్యదర్శి కైలాసపతి తదితరులు పాల్గొన్నారు.

నులి నిర్మూలనకు కృషి

జాతీయ నులి పురుగుల నిర్మూలన దినోత్సవం

ఉప్పల్/మల్కాజిగిరి జోన్ పరిధిలో జాతీయ నులిపురుగుల నిర్మూలన దినోత్సవం సందర్భంగా చిన్నారులకు నివారణ మాత్రలను అందజేశారు. గురువారం నిర్వహించిన ఈ కార్యక్రమంలో పలువురు ప్రజా ప్రతినిధులు, చిన్నారులకు స్వయంగా మాత్రలను వేసి ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలని తగిన సూచనలు చేశారు. పరిసరాల శుభ్రతతో పాటు వ్యక్తిగత శుభ్రతతోనే ఆరోగ్యంగా ఉంటామని చెప్పారు. ప్రభుత్వ పాఠశాలలు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, ప్రైవేటు పాఠశాలల్లో విద్యార్థులకు ఆరోగ్యంపై అవగాహన కల్పించారు.

- ఉప్పల్ /మల్కాజిగిరి జోన్ల బృందం


నులి పురుగుల నివారణ మాత్రలను వేస్తున్న ఎమ్మెల్యే, కార్పొరేటర్


నేరేడ్‌మెట్ ప్రభుత్వ పాఠశాలలో ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డి

రాణే ఇంజిన్ వాల్స్‌లో బీఆర్‌టీయూ గెలుపు



మేడ్చల్: మేడ్చల్ పారిశ్రామిక వాడలోని రానే ఇంజన్‌వాల్స్ కంపెనీలో గుర్తింపు యూనియన్ కోసం గురువారం జరిగిన ఎన్నికలలో బీఆర్‌ఎస్ అనుబంధ కార్మిక సంఘం బీఆర్‌టీయు గెలిచింది. యూనియన్ అధ్యక్షుడిగా మల్కాజ్‌గిరి ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డి విజయం సాధించారు. ఎన్నికలలో బీఎంఎస్, బీఆర్‌టీయూ యూనియన్‌లు తలపడగా 116మంది కార్మికులు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. బీఆర్‌టీయు 78 ఓట్లు, బీఎంఎస్‌కు 38 ఓట్లు వచ్చాయి.40 ఓట్ల మెజారిటీతో రాజశేఖర్‌రెడ్డి విజయం సాధించారు.

ఎంపీ ఈటలను కలిసిన నేతలు



మేడ్చల్ రూరల్: మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్‌ను గురువారం రాష్ట్ర ఆర్‌ఎంపీ, పీఎంపీ వెల్ఫేర్ అసోసియేషన్ నాయకులు కలిశారు. మండలంలోని పూడూర్ గ్రామ పరిధిలోని ఈటల నివాసంలో ఆయనను కలిసి తమ సమస్యలను వివరించి వినతిపత్రం అందజేశారు. బీజేపీ రాష్ట్ర నాయకులు మోహన్‌రెడ్డి, అసోసియేషన్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ చంద్రశేఖర్ పాల్గొన్నారు.

భూకబ్జాదారుపై కేసు నమోదు

పోచారం: ఖాళీ ప్లాటును ఆక్రమించి, షెడ్డు నిర్మించిన వ్యక్తిపై పోచారం పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైంది. పోలీసులు, బాధితురాలు తెలిపిన మేరకు.. అన్నోజిగూడ, సూర్యనగర్ కాలనీలో రాధారం జ్యోతి స్థలాన్ని కొనుగోలు చేశారు. అయితే ప్లాట్‌లో వేణు గోపాల్ యాదవ్ అక్రమంగా షెడ్ నిర్మించాడు. దీంతో తన ప్లాట్‌ను కబ్జాచేసిన వ్యక్తిపై ఆమె పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఇదే విషయాన్ని పోచారం మున్సిపల్ కమిషనర్ దృష్టికి తీసుకెళ్లినట్లు తెలిపారు. అందుకు కమిషనర్ స్పందించి షెడ్‌ను కూల్చివేస్తామని చెప్పారన్నారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు వేణు గోపాల్‌పై పోలీసులు కేసు నమోదు చేశారు.

త్వరలో గ్రంథాలయాన్ని ప్రారంభిస్తాం


గ్రంథాలయ భవనాన్ని పరిశీలిస్తున్న మున్సిపల్ చైర్మన్ చంద్రారెడ్డి

కీసర: నాగారం మున్సిపాలిటీలో ప్రజలు, యువత, విద్యార్థులకు ఉపయోగకరంగా ఉండే గ్రంథాలయాన్ని ప్రారంభించి ప్రజలకు అందుబాటులోకి తీసుకువస్తామని నాగారం మున్సిపల్ చైర్మన్ కౌకుట్ల చంద్రారెడ్డి అన్నారు. గురువారం నాగారం మున్సిపాలిటీలో నిర్మించిన గ్రంథాలయ భవనాన్ని జిల్లా గ్రంథాలయ సెక్రటరీ సురేష్‌బాబుతో కలిసి పరిశీలించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ త్వరలో గ్రంథాలయంలో అన్ని రకాల పుస్తకాలను అందుబాటులో ఉంచుతామన్నారు. మున్సిపల్ కమిషనర్ రాజేంద్రకుమార్, కౌన్సిలర్ సుర్వీశ్రీనివాస్ పాల్గొన్నారు.